"నా పేర వున్న రెండు జూట్ మిల్స్ తాలూకు షేరు, ఒక కాటన్ మిల్ తాలూకు షేరు, మూడు షుగర్ ఫేక్టరీల తాలూకు షేరు, బొంబే, ఢిల్లీ, మద్రాస్, కలకత్తాలోని నా పేర ఉన్న గెస్టుహౌస్‌లు నాలుగు, వివిధ కంపెనీలలోని షేరు, డిబెంచరు, యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలోని యూనిట్స్, బేంక్ బేలన్సులు అన్నీ నా భార్యకి చెందుతాయి.

కాని ఒక షరతు మీదే అవి నా భార్యకు చెందుతాయి. ఆ షరతేమిటంటే నేను బ్రతికుండగా నాకు తీరని కోరిక ఒకటి మిగిలిపోయింది. అది ఇంట్లో, ముఖ్యంగా భోజనానంతరం, సిగార్ తాగాలన్న కోరిక. నా భార్యకి సిగార్ పొగ పడదు కాబట్టి, బలవంతంగా నాచేత ఆ పని చేయకుండా మాన్పించింది మా పెళ్ళయిన మొదటిరోజునుంచే! నా కోరికని అపుకోలేక టాయ్‌లెట్‌లోకి వెళ్ళి రహస్యంగా తాగిన సందర్భాలున్నాయి. ఈవిషయంలో నాకు నా భార్యంటే పరమ అసహ్యం వేసుంది. నాకు లభ్యమయ్యే ఒకానొక అమితానందాన్ని బలవంతంగా అణచివేసింది నా భార్య నేను ఎన్నివిధాల బ్రతిమాలుకున్నా వినలేదు.

ఈ కారణంచేత, నా భార్య, రోజుకి పది సిగార్‌లు త్రాగేపక్షంలోనే నా ఆస్తికి ఆవిడ పైన పేర్కొన్న విధంగా హక్కుదారు అవుతుంది అలా త్రాగని పక్షంలో, నా ఆస్తిలోంచి ఆవిడకి ఒకే రూపాయ చెందుతుంది సంవత్సరానికి. మిగతాది నా పేర ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఆ ట్రస్ట్ ద్వారా దేశంలోని సిగార్స్ త్రాగేప్రతీవాళ్ళకి నా పేర వారానికి ఒక సిగార్ పెట్టె వుచితంగా పంచిపెట్టాలి ఇది నా అంతిమ కోరిక."

## మళ్ళీ పెళ్ళి

ప్రపూర్ణ కాపరానికి వచ్చి వారం రోజులయింది భర్త ఆఫీసుకు వెళ్ళగానే ఇంట్లో ఒక్కతే ఉండాలి ఆయన అంటే ఆదికేశవులు, ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తూ, గడియారం ముల్లు ఆరు మీదకి ఎప్పుడు వస్తుందా, తన భర్త ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తూ గడుపుతుంది.

ఆ రోజు కాలం గడపటానికి ఆదికేశవల సూట్‌కేసులు రెండు తెరచి వాటిలోని కాగితాలను సర్ద సాగింది కాగితాలనిచూసి, పనికొచ్చేవి ఒక ప్రక్క పనికిరానివి ఇంకో ప్రక్క అమర్చ సాగింది. ఆయన్నడిగి పనికిరానివాటిని చిత్తు కాగితాల క్రింద అమ్మేయ వచ్చునుకుంది

ఆర్థర్‌హెయిలీ వాసిన "ఏర్‌పోర్ట్" నవల బయటికి తీసి పేజీలు తిప్పి చూసింది లోపల ఓ కవరు ప్రపూర్ణ కళ్ళబడింది. దాన్ని బయటికి తీసి కవరు విప్పి లోపల నుంచి ఓ కార్డు రెండు వేళ్ళతో బయటకు లాగింది.

అది శుభలేఖ పెళ్ళికి రమ్మని ఆహ్వానించే శుభలేఖ. పెళ్ళికొడుకు ఆదికేశవులు! పెళ్ళికూతురు కుమారి మేనక!! తమపెళ్ళి జరగటానికి సంవత్సరన్నర క్రితం జరిగిందా పెళ్ళి!!!

ఇంటిపేరు, తండ్రి పేరుకూడా సరిపోయాయి. ప్రపూర్ణ ఆ శుభలేఖని పదిసార్లయినా చదివితేగాని తన కళ్ళని తాను నమ్మలేక పోయింది. నమ్మగానే కోపం దుఃఖం ముంచుకువచ్చాయి.

ఆదికేశవులు తనని మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు తనని మోసం చేశాడు బహుశ మేనకతో ఎక్కడో కాపురం పెట్టేవుంటాడు ఇంక ఇలా ఎంత మందిని చేసుకున్నాడో? ఎంత మంచివాడిలా నటిస్తున్నాడు తనముందు?

ప్రపూర్ణ భర్త ఆగమనం కోసం ఎదురు చూడసాగింది అగ్నిపర్వతం శిఖరంమీద కూర్చున్నట్లుగా వళ్ళంతా కోపంతో సెగలుకక్కసాగాయి.

ఆదికేశవులు నవ్వుతూ వచ్చాడురోజులాగే, "ఎందుకు నన్నిలా అన్యాయం చేశారు?" ఏడుపు, కోపం దిగమింగుకుంటూ అడిగింది ప్రపూర్ణ.

"ఎలా అన్యాయం చేశానో చెప్తే, ఎందుకో చెప్తాను" అన్నాడు ప్రపూర్ణని మీదకు లాక్కొంటూ.

"వదలండి నన్ను మళ్ళీ ఎందుకు పెళ్ళిచేసుకున్నారు?" అడిగింది తీవ్రంగా.

"మళ్ళీ పెళ్ళా?" తెల్లబోతూ అడిగాడు ఆదికేశవులు.

"అవును కాకపోతే ఇదేమిటి?" ఆశుభలేఖ ఆదికేశవులు మీదకి విసిరింది.

దాన్నిచూసి, కొన్ని క్షణాలు అర్థంకానట్లుగా చూశాడు ఆదికేశవులు భార్య వంక.

"మాట్లాడరేం?" గర్జించింది ప్రపూర్ణ ఆడసింహంలా గట్టిగా.

పకపకా నవ్వుతూ చెప్పాడు ఆదికేశవులు.

ఓహో గుర్తొచ్చింది పూర్వం బ్రహ్మచర్యంలో వున్నప్పుడు మా ఇంటాయనకో ప్రెస్సువుంది. ఆయన తయారుచేశారో కార్డు. నాకు రేషన్ కార్డు త్వరగా రావాలంటే, చక్కెర ఎక్కువ దొరకాలంటే, పెళ్ళయినట్లు అబద్దం ఆడాలన్నాడు. అందుకీ అబద్ధపు సాక్ష్యాన్ని సృష్టించాడు కావాలంటే ఇప్పుడే ఆయనింటికి నడు"

# పెళ్ళిచూపులు

"సాయంత్రం కాలేజీ అయ్యాక మా ఇంటికోసారి రారాదు?" అడిగింది మైథిలి తన స్నేహితురాలిని.

"వస్తాను"

"నీవుకూడా రావే" సౌమిత్రికి చెప్పింది మైథిలి.

"ఎందుకు?" అడిగింది సౌమిత్రి.

"టీకి"

"ఏదైనా అకేషనా?"

"అవును"

"పుట్టిన రోజా?"

"నాకు పెళ్ళిచూపులు!"

చిన్నగా ఈలవేసింది సౌమిత్రి.